ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 181
బుధవారం 08 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఇండోనేసియా చేతికి భారత 'బ్రహ్మాస్త్రం'.. మోదీ పర్యటనలో డీల్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 07)
'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన మన సూపర్ సోనిక్ క్షిపణి 'బ్రహ్మోస్'పై ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా ఈ క్షిపణుల కోసం భారత్‌తో ఇండోనేసియా ఒప్పందం చేసుకుంది. ప్రధాని మోదీ జకార్తా పర్యటనలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రహ్మోస్‌తో పాటు 'అస్త్ర' క్షిపణుల సరఫరా కోసం ఇరు దేశాల మధ్య డీల్ కుదిరింది.మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేసియాలో ఉన్న ప్రధాని మోదీ .. మంగళవారం ఆ దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలపై

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం



భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

## ఒప్పందాన్ని బేఖాతరు చేసిన ఇరాన్.. హార్మూజ్‌లో మళ్లీ మిస్సైళ్ల మోత



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 07)
ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఒమన్ తీరానికి సమీపంలో ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ రెండు వాణిజ్య నౌకలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ ఘటనలో నౌకలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం అందగా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, పర్యావరణానికి

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ..

## ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులు ఇవే!



ఏపీకి రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.

## ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం: పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు.
"వంశపారపర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాలి. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారు.



## ఏపీకి పెట్టుబడుల వేట.. కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ



## సముద్రంపై ఎక్కడా ఆగకుండా 11 రోజులు.. ఓ పక్షి అద్భుత ప్రయాణం

బార్-టెయిల్డ్ గాడ్విట్ పక్షి అసాధారణ ప్రయాణ సామర్థ్యం
ఆగకుండా 11 రోజుల్లో 13,560 కిలోమీటర్లు ప్రయాణించి రికార్డు
అలస్కా నుంచి టాస్మానియాకు ఆహారం, నీరు లేకుండా యాత్ర
ప్రయాణానికి ముందు రెట్టింపు బరువు పెరిగి సిద్ధమవడం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 07)
ప్రకృతిలో కొన్ని జీవుల పట్టుదల, సామర్థ్యాలు విస్మయానికి గురిచేస్తుంటాయి. అటువంటి వింతలో 'బార్-టెయిల్డ్ గాడ్విట్' అనే పక్షి సాగించే సాహసోపేత యాత్ర అద్వితీయమైంది. ఆహారం, నీరు, కనీసం విశ్రాంతి కూడా లేకుండా ఏకధాటిగా 11 రోజుల పాటు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటగల దీని సామర్థ్యం శాస్త్రవేత్తలనే విస్తుపోయేలా చేస్తోంది. 2022లో ఒక యువ గాడ్విట్ పక్షి అలస్కా నుంచి ఆస్ట్రేలియాలోని టాస్మానియాకు నిరంతరాయంగా ప్రయాణించి కొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 11 రోజుల ఒక గంట వ్యవధిలో దాదాపు 13,560 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఒక పక్షి ఎక్కడా ఆగకుండా ఇంత సుదీర్ఘ దూరం ప్రయాణించడం

## ఏపీలో డిస్‌ప్లే ఫ్యాబ్ ఏర్పాటు చేయాలి: లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ఏపీ మంత్రి నారా లోకేశ్ హ్యుందాయ్ మోబిస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, అపాక్ట్, ఎల్జీ కెమ్, శాంసంగ్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల అధినేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. సియోల్ నగరంలో ప్రధాన పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణల కేంద్రమైన ప్రతిష్ఠాత్మక మాగోక్ (హీూ+ూఖ) సైన్స్ పార్క్‌ను సందర్శించారు. శాంసంగ్ సీనియర్ డైరెక్టర్ హెలెనా పార్క్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో డిస్‌ప్లే ఫ్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఐఎస్ఎం 2.0, ప్రత్యేక సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ ద్వారా మద్దతిస్తామన్నారు. ఫుల్ ఏఐ-కంప్యూట్ స్టాక్ కోసం ఏపీని శాంసంగ్ కేంద్రంగా మార్చాలని కోరారు."ఏపీలో ఏఐ-రెడీ హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు అభివృద్ధి చేయాలి. ఏఐ-సర్వర్ తయారీని స్థానికీకరించి, లోకల్ సర్వర్ సర్వీసింగ్

## గిరిజనులకు త్వరలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
గిరిజనులకు త్వరలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు జారీ చేయనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అర్హులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో తాజా పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలకు సూచించారు. సచివాలయంలో అధికారులతో మంత్రి సోమవారం సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గిరిజన అభివృద్ధి కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 626 గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పరిశుభ్రత, ఆహార నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 2,161 మంది క్లీనింగ్ స్టాఫ్, కుక్‌లు, కమాటీలను పొరుగుసేవల కింద నియమించనున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. పాఠశాలల భవనాల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధికి రూ.21.80 కోట్లు కేటాయించామన్నారు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా ట్రంక్ బాక్స్‌లు, బెడ్ షీట్లు, మ్యాట్రెస్‌లు, వాటర్ టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు మరో రూ.50 కోట్లు కేటాయించామని వివరించారు.

## త్వరలో 'నేతన్న భరోసా' పథకం అమలు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే పూర్తయిందని ఆమె తెలిపారు. ఆప్కో స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం మంగళగిరిలోని ఆప్కో తోటలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత హాజరై ప్రసంగించారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో చెల్లించాల్సిన రూ.6.50 కోట్ల బకాయిలను త్వరలో చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు. నేతన్నలకు ఆప్కో ద్వారా నూలు సరఫరా చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఆప్కోకు పూర్వవైభవం కల్పించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. రెడీమేడ్ చేనేత వస్త్రాల తయారీలో నేతన్నలకు శిక్షణ ఇస్తున్నామని మంత్రి సవిత చెప్పారు.ఆప్కో చరిత్రలో తొలిసారిగా తితిదేతో ఒప్పందం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. చేనేత సహకార సంఘాలు ముందుకొస్తే తితిదేకి అవసరమైన శాలువాలు, చీరలు, జాకెట్లు, కండువాల కొనుగోలుకు ఆర్డర్లు



## సామాజిక మాధ్యమాల్లో వ్యవస్థీకృతంగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 07)
సామాజిక మాధ్యమ వేదికల ద్వారా అసభ్యకర పోస్టులు పెట్టటం, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయటం, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడటం వంటివి వ్యవస్థీకృతంగా చేస్తున్న నేరగాళ్లపై నెట్‌వర్క్ ఆధారిత దర్యాప్తు ముమ్మరం చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసు అధికారులను ఆదేశించారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య చర్చలు, చట్టబద్ధమైన విమర్శలకు ఎలాంటి భంగం కలగకుండా ఈ చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. ఈ తరహా నేరాలకు పాల్పడ్డ వారిపై రెండేళ్లలో 1,665 కేసులు నమోదు చేశామని, అలాంటి పోస్టులకు సంబంధించి 12,653 వెబ్‌లింక్‌లను సహయోగ్ పోర్టల్ ద్వారా తొలగించామని వెల్లడించారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీలు, రేంజ్‌ల డీఐజీలు, ఐజీలు, ఇతర ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల్లో సైబర్ గార్డ్ యూనిట్లు, జిల్లా సోషల్

## మొదటిపేజీ తరువాయి

## ఇండోనేసియా చేతికి భారత 'బ్రహ్మోస్త్రం'.. మోదీ పర్యటనలో డీల్

సంతకాలు జరిగాయి. క్రిటికల్ మినరల్స్, టెక్నాలజీ, ఆహార భద్రత, సముద్ర జలాల భద్రత, ఔషధాలు, మిలిటరీ వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి.

ఇండోనేసియా సైన్యానికి బ్రహ్మోస్ క్షిపణులను అందించేందుకు భారత్ అంగీకరించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జకార్తా భద్రతా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఈ క్షిపణులు దోహదం చేయనున్నాయి.భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎయిర్ టు ఎయిర్ 'అస్త్ర' క్షిపణులను ఇండోనేసియా దిగుమతి చేసుకోనుంది. 'సిందూర్'లో ఈ క్షిపణుల సమర్థతను చూసి వీటి కొనుగోలుకు జకార్తా ఆసక్తి చూపించింది.కీలక ఖనిజాల సరఫరా గొలుసును మరింత బలోపేతం చేసేలా.. ఇండోనేసియాలోని స్టీల్, నికెల్, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీలో భారత్ పెట్టుబడులు పెట్టనుంది.ఇండోనేసియాలోని సబాంగ్ పోర్ట్‌ను సంయుక్తంగా నిర్మించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. మలక్కా జలసంధికి సమీపంలో ఉండే ఈ పోర్ట్.. భారత్‌కు వ్యూహాత్మకంగా కీలకమైనది. ఇండోనేసియా అవసరాల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తయారీకి భారత్ సాంకేతిక సాయం అందించేందుకు అంగీకరించింది.

**మోదీకి అత్యున్నత పురస్కారం..**

ఇదిలా ఉండగా.. తమ దేశానికి విచ్చేసిన ప్రధాని మోదీని ఇండోనేసియా ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా' పురస్కారంతో గౌరవించింది.. ఆ దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో.. ఈ మెడల్‌ను మోదీకి అందజేశారు.

## ఏపీకి పెట్టుబడుల వేట.. కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు.ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం

ఈరోజు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

## ఒప్పందాన్ని బేఖాతరు చేసిన ఇరాన్.. హర్మూజ్‌లో మళ్లీ మిస్సైళ్ల మోత

పెద్దగా ముప్పు వాటిల్లలేదని ప్రాథమికంగా వెల్లడైంది.అమెరికా అధికారుల కథనాల ప్రకారం, ఇరాన్ జరిపిన దాడుల్లో కనీసం రెండు నౌకలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్‌ను గుర్తుతెలియని ప్రొజెక్టైల్ ఢీకొట్టింది. ఈ ప్రభావంతో ట్యాంకర్‌లో మంటలు చెలరేగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ధృవీకరించింది.ఈ కీలక జలమార్గంలో నౌకలపై దాడులను నిలిపివేసేలా అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, కొన్ని రోజుల వ్యవధిలోనే తాజా దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇరాన్ చర్యలపై అమెరికా అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురు, సహజవాయువు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో తరచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం: పవన్ కల్యాణ్

రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దాం" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## సామాజిక మాధ్యమాల్లో వ్యవస్థీకృతంగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు

యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. సున్నిత ప్రాంతాల్లో రాజకీయ పర్యటనలకు సంబంధించి ప్రామాణిక నిర్వహణ విధానాలు రూపొందించాలని సూచించారు. భూ వివాదాల ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు.

## సముద్రంపై ఎక్కడా ఆగకుండా 11 రోజులు.. ఓ పక్షి అద్భుత ప్రయాణం

ఇదే ప్రథమం. సాధారణంగా ఆర్కిటిక్ ప్రాంతంలో నివసించే ఈ పక్షులు, శీతాకాలం ప్రారంభంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి ప్రాంతాలకు వలస వెళుతుంటాయి.ఈ అసాధారణ ప్రయాణం వెనుక ఆశ్చర్యకరమైన శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. వలస ప్రయాణానికి సిద్ధమయ్యే ముందు ఈ పక్షులు విపరీతంగా ఆహారం తీసుకుని, తమ శరీర బరువును దాదాపు రెట్టింపు చేసుకుంటాయి. ప్రయాణ సమయంలో బరువును సమతుల్యం చేసుకునేందుకు, తమ జీర్ణవ్యవస్థలోని కొన్ని అవయవాలను తాత్కాలికంగా కుదించుకుంటాయి. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును శక్తిగా మార్చుకుంటూ వేల కిలోమీటర్ల దూరాన్ని ఇవి అధిగమిస్తాయి.

మార్గమధ్యలో ఎలాంటి భూభాగం లేని విశాల సముద్రంపై ప్రయాణిస్తున్నప్పుడు, ఇవి నక్షత్రాలు మరియు భూమి యొక్క అయస్కాంత క్షేత్రాల ఆధారంగా దిశను గుర్తించగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయాణ సమయంలోనే మెదడులోని ఒక భాగానికి విశ్రాంతినిస్తూ, మరో భాగంతో అప్రమత్తంగా ఉంటూ తమ నిద్ర అవసరాలను తీర్చుకుంటాయని భావిస్తున్నారు. ఈ పక్షుల యాత్రలు జీవ పరిణామం, శక్తి వినియోగం వంటి అంశాలపై మరిన్ని నూతన పరిశోధనలకు స్ఫూర్తినిస్తున్నాయి.

## ఏపీలో డిస్‌ప్లే ఫ్యాబ్ ఏర్పాటు చేయాలి: లోకేశ్

హబ్ పెట్టాలి. విశాఖలోని క్లస్టర్ కేంద్రంగా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు చేయాలి. మొబైల్స్ కోసం ఓఎస్ఏటీ కేంద్రం ఏర్పాటును పరిశీలించాలి. ఏపీలో మొబైల్, డివైసెస్ బ్యాటరీ కేంద్రం ఏర్పాటు చేయాలి. శాంసంగ్ ఆర్అండ్‌డీ విభాగాన్ని అమరావతి క్వాంటం వ్యాలీలోకి తీసుకురావాలి" అని మంత్రి లోకేశ్ కోరారు. డెడికేటెడ్ శాంసంగ్ సిటీని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

## త్వరలో 'నేతన్న భరోసా' పథకం అమలు

ఇస్తామని చెప్పారు. అనంతరం ఆమె ఆప్కోలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెక్కులను అందజేశారు.

**బీసీల కోసం రూ.1.37 లక్షల కోట్ల కేటాయింపు ఓ రికార్డు**

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ బీసీల సంక్షేమానికి రికార్డు స్థాయిలో రూ.1.37 లక్షల కోట్లు కేటాయించామని మంత్రి సవిత తెలిపారు. వైకాపా ప్రభుత్వం బీసీ వసతి గృహాల మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని... డైట్ బిల్లులు చెల్లించకుండా పెండింగ్ పెట్టిందని మండిపడ్డారు. రూ.110 కోట్ల పెండింగ్ డైట్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా పది ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ..

ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు.పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు.


ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:**

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ.139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ.52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ.68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ.62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ.255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ.1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ.1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ.689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ.1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ.2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మొండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ.1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

## వరికుంట్ల అనిల్‌కు ఘన సత్కారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)

పొదిలి మండల పాస్టర్ అహరోను ఫెలోషిప్ వారి 3వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మయ్యతోట వద్ద గల గ్రేస్ ప్రేయర్ హాలు నందు రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్‌ను పాస్టర్లు మంగళవారం శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ తాళ్లూరి సాంసన్, వైస్ ప్రెసిడెంట్ మోతుకూరి తిమోతి, సెక్రటరీ ఆర్ ప్రభుదాస్, జాయింట్ సెక్రటరి జి యోహాను, ట్రెజరర్ టి ఐజక్, కార్యదర్శి జి పాల్, ఆర్ ఎర్రయ్య, అంబటి శ్యాంబాబు, విల్సన్, జె జాన్, వాఖ్యాపదేశకులు పి శ్యాంబాబు, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## మడతల వారి వివాహ వేడుకకు హాజరైన బూచేపల్లి, అన్నా దద్దాల



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 7)

కనిగిరి పట్టణం కొత్తపేటలో కనిగిరి జడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షులు మడతల కస్తూరిరెడ్డి తమ్ముడు మడతల నాగిరెడ్డి-పెద్దక్క కుమార్తె సుప్రియ వివాహ వేడుకలో మంగళవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్‌లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా నూతన వధువు సుప్రియను ఆశీర్వదించి, వివాహ శు భాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్, గుంటక తిరుపతిరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, ఓకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి, పులి శాంతి, తమ్మినేని సుజాత, సిరుప గోవర్ధన్‌రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, పోలక సిద్ధారెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు, దద్దాల రాములు, మద్ది తిరుపతయ్య, భూమిరెడ్డి కొండారెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ శ్రీనివాసులు, సైకం ఏడుకొండలురెడ్డి, ఉడుముల మధుసూదన్‌రెడ్డి, సంగటి మహేంద్రరెడ్డి, టి రాజారెడ్డి, సానికొమ్మి మధుసూదన్‌రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, మిట్ట రమేష్‌రెడ్డి, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, మల్లెల వెలుగొండయ్య, చందా నర్సారెడ్డి, మితికాల బాలకృష్ణ, మున్నా, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## యస్ఐఆర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న పొదిలి ఏఎంసి ఛైర్మన్ సయ్యద్ ఇమాంసా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)

పొదిలి పట్టణంలోని 228 బూత్‌లో యస్ఐఆర్ కార్యక్రమంలో మంగళవారం పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి అక్కడి అధికారులతో ప్రజలకు ఏ విధంగా ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏ ఒక్కరి ఓటు కూడా కోల్పోకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మైదుకూరులో వైఎస్సార్ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 7)


తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత, అమరజీవి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో నిర్వహించబోతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్ ఆశయ సాధనలో భాగస్వాములవుతూ, ఆయనకు ఘన నివాళులు అర్పించేందుకు పార్టీ శ్రేణులన్నీ భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తమ పరిధిలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, ఆయన చేసిన సంక్షేమ పాలనను స్మరించుకుంటూ నివాళులు అర్పించాలన్నారు. మండలాల్లో కార్యక్రమాలు ముగిసిన వెంటనే నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ఉదయం 10 గంటలకు మైదుకూరు పట్టణ కేంద్రంలోని వైఎస్ఆర్ ప్రధాన విగ్రహం వద్దకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, మండల కన్వీనర్లు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా ప్రతినిధులు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు తమ అనుచరులతో కలిసి తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ కార్యాలయం కోరింది.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

08.07.26 బుధవారం



## సీఎం చంద్రబాబును కలిసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 7)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అమరావతి సచివాలయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు మండలంకు మేదరమిట్ల స్కీం ద్వారా అందిస్తున్న త్రాగునీరు పైప్ లైన్ పూర్తిగా పాడైపోవడం వళ్ళ రూ.16 కోట్లతో కొత్త పైప్ లైన్ నిర్మాణం కోసం మంజూరు చేయాలని కోరారు. ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్లవాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి అన్ని, కొత్తపట్నం బీచ్ రోడ్డుకు, కరవది నుండి గుండాయిపాలెం వరకు డబల్ రోడ్డు కోసం నిధులు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో మంగమూరు రోడ్డు, కేసరాజుగుంట రోడ్డు విస్తీర్ణం కోసం కావాల్సిన నిధులు త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని తెలిపారు.

## రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

### రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్ డైరెక్టర్ కూర్మనాథ్

**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 7)**

ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో రైతులను భాగ స్వాములను చేసి వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టరు కోణంకి కూర్మనాథ్ ఆదేశించారు. మంగళవారం మార్కాపురం జిల్లా కంభం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.




# వైసీపీ నేత తండ్రికి ఎల్ ఓసి మంజూరు

## రూ.2 లక్షల వైద్య సహాయం అందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 7)**

ఆపదలో ఉన్న ప్రతిపక్ష నాయకుడి కుటుంబానికి తక్షణ వైద్య సహాయం అందించి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గొప్ప మనసు చాటుకున్నారు. కందుకూరు పట్టణంలోని బృందావనంకు చెందిన చనమాల కోటేశ్వరరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడి పదవిలో ఉన్నారు. కోటేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు గుండె జబ్బుతో ఇటీవల ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్‌లో చేరారు. వెంకటేశ్వర్లుకు ఆపరేషన్ చేయాలని, అందుకు 4 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. అయితే కోటేశ్వరరావు కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు చెల్లించే స్థోమత లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో కోటేశ్వరరావు, టిడిపి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుదర్శి శ్యామ్, మేదర సంఘం నాయకులు భవనాసి వెంకటేశ్వర్లుకు తన సమస్య గురించి చెప్పుకున్నాడు. వారి సూచనతో ఎమ్మెల్యే నాగేశ్వరరావును కోటేశ్వరరావు కలిసి, తండ్రి ఆపరేషన్ కోసం సాయం చేయాలని అభ్యర్థించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణ వైద్య సహాయ చర్యల్లో భాగంగా ఎల్‌ఓసి ద్వారా రూ.2,01,480లు మంజూరు చేయించారు. ఇంకా ఏదైనా అవసరమైతే తనకు ఫోన్



## ఏపీ ఎయిమ్స్ 2.0యాప్‌తో రైతులకు మరింత ప్రయోజనకరం

### జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 7)**

ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ తో రైతులకు మరింత ప్రయోజనకరం చేకూరనుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ కు సంబంధించిన పోస్టర్ ను ఆమె

4

## రూ.2 కోట్ల విలువైన 1,321 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

### ఆరో విడత మొబైల్ రికవరీ కార్యక్రమంలో ఎస్పీ ఉమామహేశ్వర్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 7)**

జిల్లాలో పోయిన, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించే ఆరో విడత మొబైల్ రికవరీ - పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ పాల్గొని రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు. తమకు పోయిన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోయిన, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఆరో విడతలో మొత్తం 1,321 మొబైల్ ఫోన్లను గుర్తించి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో సాంకేతిక విభాగం, సైబర్ సెల్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ ఫలితాన్ని సాధించారని ఎస్పీ తెలిపారు. రికవరీ ప్రక్రియలో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, త్వరితగతిన సమాచారం అందిస్తే రికవరీ అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయని ప్రజలకు ఎస్పీ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజల ఆస్తులను తిరిగి అందించేందుకు జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.





## తప్పిపోయిన ఆరేళ్ల బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 7)**

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువుకొమ్ము పాలెం గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల వయసు గల జి రిచర్డ్ రేయాన్స్ మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో కనిపించకుండా పోయిన ఘటన పై ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాలుడి ఆచూకీని కనుకొనటానికి ప్రత్యేకంగా 20 పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. బాలుడు వెళ్లి ఉండే అవకాశమున్న ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టడంతో పాటు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా

### చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని సంఘటనా స్థలాన్ని సందర్శించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు







# హాలో మాదిగ-ఛలో ఈదుమూడి భారీగా తరలిన గిద్దలూరు నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 7)

హాలో మాదిగ–ఛలో ఈదుమూడి పిలుపు మేరకు నిర్వహించిన మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సుమారు 300 మంది కార్యకర్తలతో ఈదుమూడికి చేరుకోనున్న గిద్దలూరు నియోజకవర్గ బృందానికి రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి షాలేంరాజ్ నాయకత్వం వహించారు. మాదిగల ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం లక్ష్యంగా నిర్వహించిన ఈ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నేదరపల్లి జయరాజ్, గోన మోహన్రావు, బోడిచర్ల రాజు, బడ్డీటి భాస్కర్, బుదాల ఆనంద్, సురేష్, రత్నం సురేష్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్యాం, సాగర్ రాజు, రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా మహిళా నాయకులు రాణెమ్మ, జేయమ్మ, ప్రియాంక, సుభద్ర, శాంతి, షిలా, ప్రమీల, అరుణమ్మతో పాటు గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, ఐక్యత కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. శంకుస్థాపన మహోత్సవం మాదిగ సమాజ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగడంతో పాల్గొన్న ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# దళిత మైనర్ బాలిక పై లైంగిక దాడి ఆరోపణలు నిందితుల అరెస్టు కోరుతూ మాల మహానాడు ఆందోళన




(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూలై 7)

మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలిక పై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు రావడంతో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధించి, ఫోన్‌లో మాట్లాడిన సంభాషణలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సోమవారం ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.146/2026గా పోక్సో, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని వెంటనే అరెస్టు చేసి బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని దారా అంజయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పులి వికాస్, అంకం కిరణ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


# తప్పిపోయిన ఆరేళ్ల బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు






పరిశీలించాలని, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించాలని, కొత్త వ్యక్తులు విచారణ, వాహన తనిఖీలు, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని, బాలుడిని చివరిసారిగా చూసిన వ్యక్తులను గుర్తించి వారి నుంచి సమాచారం సేకరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా, ప్రక్క ఉన్న జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు బాలుడి వివరాలను వెంటనే చేరవేసి, గాలింపు చర్యలను వేగవంతం చేయాలని, బాలుడి ఆచూకీ కొరకు అన్ని కోణాల్లో విచారణ కొనసాగించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా ఇన్స్‌పెక్టర్ విజయకృష్ణ, తాలూకా ఎస్ఐ ఫిరోజ్, సిబ్బంది ఉన్నారు.

# వైసీపీ నేత తండ్రికి ఎల్ ఓ సి మంజూరు




చేయాలని సూచించారు. దీంతో వెంకటేశ్వర్లుకు ఆపరేషన్ చేయించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. దీని పై ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే పరిమితం అన్నారు. వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న వారు ఏ పార్టీ వారైనా సరే సహాయం అందించడానికి వెనుకాడబోనని తెలిపారు. సహాయం అందుకున్న వారు కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కందుకూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఇప్పటివరకు అనేక మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిధులు అందించామని ఎమ్మెల్యే తెలిపారు.

# విషాదం నింపిన రోడ్డు ప్రమాదం మహిళా కూలి మృతి



## నామ్ రహదారిపై ఘోర ప్రమాదం ఇద్దరు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూలై 7)

అద్దంకి సమీపంలోని నామ్ రహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కూలి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం ప్రకారం, నామ్ రహదారి వెంట జరుగుతున్న మరమ్మత్తుల పనుల్లో కొందరు మహిళా కూలీలు నిమగ్నమై ఉన్న సమయంలో అద్దంకి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఓ లారీ వారి పైకి దూసుకెళ్లింది. ప్రమాదతీవ్రతకు దత్తు అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు మహిళా కూలీలు దుర్గా, హనుమాయమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపించారు. రహదారి మరమ్మత్తులు జరుగుతున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టంగా ఉండాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనతో మృతురాలి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ప్రకాశం జిల్లా డిపిఆర్ఓ ఎస్ రవికుమార్‌కు ఏపీ ఈజేయూ నాయకుల శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 7)

ప్రకాశం జిల్లా పౌర సంబంధాల శాఖ (డిపిఆర్ఓ) నూతన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ రవికుమార్‌ను ఏపీఈజేయూ (ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు యూనియన్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిపిఆర్ఓ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో ఏపీ ఈజేయూ నాయకులు రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గతంలో నెల్లూరు డివిజనల్ పీఆర్ఓగా సేవలందించిన రవికుమార్ పదోన్నతిపై ప్రకాశం జిల్లా డిపిఆర్ఓగా బదిలీ కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఎస్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను



నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. డిపిఆర్ఓను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీఈజేయూ అధ్యక్షులు అడ్డగబొట్టు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి మల్లికార్జున్‌రెడ్డి, కోశాధికారి సంజీవరావు, మన తెలుగు తల్లి ఎడిటర్ ఎం మాల్యాద్రి, వజ్రాయుధం ఎడిటర్ ఎం రామకృష్ణ, సదా మీకోసం స్టాఫ్ రిపోర్టర్ శ్రీను, జ్యోతి రిపోర్టర్ జ్యోతి, ఉషాకిరణాలు ఎడిటర్ షేక్ హుమయున్ భాష, సునీల్, తదితరులు పాల్గొన్నారు.



# రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

కంభం గ్రామానికి సంబందించిన వీఆర్వో, సర్వేయర్ల లాగిన్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సర్వే జరిగిన రోజున తప్పనిసరిగా సంబంధిత రైతులు ఉండాలన్నారు. పూర్తయ్యాక డాక్యుమెంటు వెరిఫికేషన్ ద్వారా హద్దుల నిర్ణయం వారి సమక్షంలో జరగాలన్నారు. ఇందులో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి చేతికి సరైన కొలతలతో పాసుపుస్తకం ఇవ్వాలన్నారు. గతంలో నిర్వహించిన దానిలో అనేక లోపాలు ఉండడంతో 2.0 రీ సర్వే చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2800 బృందాలతో సర్వే చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం జిల్లా సర్వేయర్ ఇన్స్‌పెక్టర్ నీలాకాంటప్ప, మండల తహసీల్దార్ కిరణ్, రెవెన్యూ, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎయిమ్స్ 2.0యాప్‌తో రైతులకు మరింత ప్రయోజనకరం

అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట నమోదు, విస్తీర్ణం ఆధారంగా యూరియా, డిఏపి కేటాయింపులు ఈ యాప్‌లో కనిపిస్తాయన్నారు. ఎరువులు పంపిణీ సమయంలో మీ ఆధార్ నెంబర్ ద్వారా పంట వివరాలు పరిశీలిస్తారన్నారు. అదే విధంగా మీకు కేటాయించిన ఎరువులు సాధారణంగా మూడు విడతలుగా చూపించబడతాయని తెలిపారు. ఎరువుల లభ్యతను బట్టి మొదటి విడతకు సంబంధించిన ఎరువులు అందజేయబడతాయన్నారు. మొత్తం కేటాయింపు మూడు బస్తాలు అంతకంటే తక్కువ అయితే ఒకే విడతలో పంపిణీ పూర్తి చేయబడుతుందన్నారు. ఎరువులు స్వీకరించిన అనంతరం రైతులు ఈ పోస్ యంత్రం లో బయోమెట్రిక్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఇంచార్జి అధికారి బాలాజీ నాయక్, ఇతర వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూలై 7)

గిద్దలూరు పట్టణంలోని పాండురంగారెడ్డి నగర్ పరిధిలోని 195వ బూత్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణ, బిఎల్ఓ, బిఎల్ఏ అధికారుల పనితీరును ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ప్రతి అర్హులైన ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బూత్ నందు బిఎల్ఓ కార్యక్రమంలో వారి పనితీరుని కలెక్టర్‌తో మాట్లాడారు. అలాగే ప్రజలు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# యూనియన్ పేరుతో వివాదాలు బయట నుంచి వచ్చి తమ షాపుల ఎదుట





## మైక్ పెట్టి వ్యాపారం చేయడాన్ని అడ్డుకున్న వైనం
## రోడ్డు పై కూరగాయలు పడబోసి భోరుమన్న బాధితుడు
## పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయతీ - ఇరువురికి సర్ది చెప్పి పంపిన పోలీసులు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)**

ఎక్కడైనా ఓ సంఘం ఏర్పాటు చేసుకుంటే ఆ సంఘం ప్రధాన ఉద్దేశ్యం ఆ సంఘంలో సభ్యులుగా ఉన్న ఎవరికైనా ఏ చిన్న సమస్య ఉన్నా మేమున్నాం అని భరోసా కల్పిచాలి. కాని ఆ యూనియన్ పేరుతో ఓ తోపుడి బండి పై కూరగాయలు తెచ్చుకుని అమ్ముకునే వ్యక్తి తో వివాదం నెలకొంది. దర్శి రోడ్డులోని బుచ్చనపాలెం గ్రామానికి వెళ్ళి ప్రధాన రహదారిలో మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఓ తోపుదు బండి వ్యాపారి బండిలో కూరగాయలు పెట్టుకుని వీధివీధి తిరుగుతూ వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే సదరు వ్యక్తి మంగళవారం ఉదయం బచ్చనపాలెం రోడ్డు వద్ద గల కూరగాయల షాపుల ఎదురుగా నిలబడి తన వద్ద ఉన్న మైకుతో ప్రచారం చేసుకుంటూ కూరగాయల వ్యాపారస్తులకంటే తక్కువ ధరకు కూరగాయలు అమ్ముతామని ప్రచారం నిర్వహిస్తున్నాడు. దీంతో అక్కడి వ్యాపారాలు తాము వేలాది రూపాయలు అద్దెలు చెల్లించుకుంటూ ఇక్కడ కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నామని, మా షాపుల వద్ద నిలబడి ఇలా మైకులో ప్రచారం చేసుకుంటూ వ్యాపారం చేయడం సరైన పద్ధతి కాదని వారించారు. ఈ క్రమంలో ఓ మహిళ వ్యాపారితో అతడికి తీవ్ర వివాదం నెలకొంది. ఓ దశలో కూరగాయల వ్యాపారులు అందరూ కలిసి స్వల్ప దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు. దీంతో ఆ బాధితుడు తన వద్ద టమోటాలను రోడ్డు పై వేసి నానా హంగామా చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షణాల్లో అక్కడకు చేరుకుని రెండు వైపుల వారిని స్టేషన్‌కు పిలించారు. వారి మధ్య జరిగిన వాస్తవాలను పోలీసులు తెలుసుకుని మరో మారు ఈ విధంగా జరగకుండా ఇరువురిని మందలించి సమస్యను పరిష్కరించారు. దీంతో దాదాపు సమస్య పరిష్కారం అయ్యిందని భావించారు. అయితే ఇదే సమయంలో పొదిలి పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సెంటర్ నందు ఓ తోపుడు బండి పై కూరగాయలు విక్రయించుకుంటున్న మరో చిరు వ్యాపారి పై ఆ పక్కనే ఉన్న ఓ కూరగాయల దుకాణం యజమాని ఆ బండి వద్దకు వచ్చి తాము యూనియన్ గా ఏర్పడ్డామని ఇక్కడ కూరగాయలు విక్రయించకూడదని తీవ్ర వాదనకు దిగాడు. ఈ సంఘటన అంతా అక్కడున్న కొంత మంది తమ కెమెరాల్లో బంధించారు. అసలు ఇంకా యూనియన్ రిజిస్టర్ కూడా కాకుండా వీరు ఇలా ప్రవర్తించడం పై పట్టణ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసలు యూనియన్ ఏర్పడేది వారికి ఉండే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి. కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం యూనియన్ పేరుతో ఇతరులు ఎవరూ పట్టణంలో కూరగాయలు విక్రయించకూడదని వాదనలకు దిగడం సరైంది కాదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. షాపులు ఏర్పాటు చేసుకుని రెంటు కట్టలేని పరిస్థితిలో ఉండే వారు చిన్న తోపుడు బండిని అద్దెకు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. అటువంటి వారిపై కూరగాయల దుకాణాదారులు యూనియన్ పేరు చెప్పి ఇలా చేయడం సరైంది కాదని ప్రజలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు.



# విద్యుత్‌శాఖాధికారులకు ముస్లింలు అభినందనలు

## యంజెయం స్టేట్ కన్వీనర్ షేక్ మహమ్మద్ (బుజ్జి)






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

స్థానిక ట్రంకురోడ్డులోని అల్లూరయ్య స్వీట్ షాపు ఏరియా, రంగుతోట, పెద్ద మసీదు సెంటర్ వద్ద రహదారికి అడ్డంగా వున్నటువంటి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతూ ముస్లిం జాగరణ్ మంచ్ ఆధ్వర్యములో ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఆందోళనకు ముందుగానే సదరు స్తంభాన్ని రహదారి నుండి తొలగించి ముస్లింలకు మేలు చేశారని యంజెయం రాష్ట్ర కన్వీనర్ షేక్ మహమ్మద్ (బుజ్జి), విద్యుత్ శాఖాధికారులను అభినందించారు. గత 6 సంవత్సరాల నుండి రహదారికి అడ్డంగా వున్నటువంటి విద్యుత్ స్తంభం తొలగించమని పలుమార్లు అధికారులకు తెలియచేసినా నిర్లక్ష్యం వహించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ద మసీదు వద్ద రహదారికి అడ్డంగావున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించమని కోరుతూ ఆందోళన కార్యక్రమం చేపట్టడంతో విద్యుత్‌శాఖ ధికారులు వెంటనే తొలగించి స్థానిక ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా పెద్ద మసీదు వద్ద వున్నటువంటి నాలుగు విద్యుత్ స్తంభాలకు కరెంటు పాస్ అవుతున్నందున వాటిని కూడా గుర్తించి, గందరగోళంగా వున్నటువంటి విద్యుత్ కనెక్షన్నును పునరుద్ధరించి విద్యుత్ స్తంభాలకు కరెంటు పాస్ కాకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను స్థానిక పలువురు ముస్లింలు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, షేక్ అబ్దుల్లా, పెరుమాళ్, షేక్ నజ్మా, శాంతి, షేక్ బుజ్జి, షేక్ బాబు, షేక్ నజీర్, షేక్ అల్లాభక్షు, షేక్ నాగూర్, షేక్ మస్తాన్, షేక్ సుభాని, షేక్ రసూల్, షేక్ నజీర్ భాషా, షేక్ షబ్బీర్, షేక్ కరిముల్లా, మహమ్మద్ వాజీద్, షేక్ మస్తాన్ వలి, తదితర ముస్లింలు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీవారి ఏకాదశ బ్రహ్మోత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 7)**

బద్వేల్ పట్టణం సిద్ధవటం రోడ్డు (ఫైర్ ఆఫీస్ వెనుక) సుమిత్రానగర్‌లో వెలసియున్న శ్రీ మహాలక్ష్మీ, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, గుడిసిపాటి అంకయ్య మరియు పలుము కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయి, స్వామివారి బ్రహ్మోత్సవాలు టి.టి.డి. ఆగమపండితులు సుదర్శన సోమశేఖర్ స్వామి బృందం వీరేష్ చార్యులు, పవన్ స్వామి, బాలాజీ స్వామి, హేమంత్ హేమంత్ స్వామి, వెంకటేశ్వర్లు స్వామి
ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు ఘనంగా మొదలయ్యాయి. మంగళవారం సాయంత్రం
౦బ్రహ్మోత్సవాల మొదటి రోజైన సాయంత్రం 5:00 గంటల నుండి ఆలయంలో పలు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, గరుడ పట అధివాసము, తీర్థప్రసాద వినియోగం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి, దైవానుగ్రహాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల శివారెడ్డి, చీదేళ్ల రమణయ్య మాదాపూర్ వెంకటరమణ, వల్లంకొశీడు రాఘవేంద్ర, అనీత్, సుబ్బారాయుడుతో పాటు పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





# మార్కాపురం జిల్లా స్థాయి స్వచ్ఛంద సంస్థల నూతన కార్యవర్గం ఏర్పాటు




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 7)**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్నటువంటి స్వచ్ఛంద సంస్థలు అన్నీ కలిసి స్థానిక ప్రెస్ క్లబ్ నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి సభాధ్యక్షులు జివి నారాయణరెడ్డి అధ్యక్షతన మార్కాపురం జిల్లా సేవా సంస్థల ఐక్యవేదికకు జిల్లా నలుమూలల నుంచి వివిధ కార్యక్రమాలలో పనిచేస్తున్నటువంటి సుమారు 70 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరు కావడం జరిగింది. నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటైన ఈ జిల్లాను అభివృద్ధి పదములో నడిపించుటకు అనేక సేవా కార్యక్రమాలు చేయవలసి ఉన్నది. ఇప్పటికే ఈ జిల్లాలో పనిచేస్తున్నటువంటి అనేక స్వచ్ఛంద సంస్థలు వారి పరిధిలో ఎన్నో సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఒక్కొక్కరిగా కాకుండా ఐక్యంగా ఉండి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. మార్కాపురం జిల్లా అధ్యక్షులుగా సీ కోటారెడ్డి, ఉపాధ్యక్షులుగా జివి నారాయణరెడ్డి, పీ రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోటారు ప్రభుదాసు, కోశాధికారిగా డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, సంయుక్త కార్యదర్శులుగా బి నరసయ్య, బి కళావతి, కార్యనిర్వాహక సభ్యులు పి శ్రీకాంత్, దాసరి రవిచంద్ర, ఎస్ విజయ్ కుమార్, జి అమీన ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ప్రకాశం జిల్లా డిఇఓ సివి రేణుకకి శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా డిఇఓ సివి రేణుక కు యుటిఎఫ్ నాయకులు మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ప్రకాశం జిల్లా డీఈవో సివి రేణుక రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నేపథ్యంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను, పరిష్కరించమని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి ఎం సంధ్యారాణి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, ఎం బాలరాజు, ఆర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ ఔషధాల పై అవగాహన సదస్సు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

ప్రకాశం జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఔషధాల పై అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఐ కె సురేష్ కుమార్, హోల్‌సేలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకిరెడ్డి, కార్యదర్శి రవి, కోశాధికారి కె సతీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సదా వ్యవస్థాపక అధ్యక్షులు డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనంతరం డి కృష్ణారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి, అందరూ కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి బాలు, చిన్నా, కొల్లా మధు, బి సుందరరాజా, ఓఆర్‌సిడిఏ నుండి సత్యం , పూర్ణ, అలాగే పిసిడి అసోసియేషన్ నుండి కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవగాహన సదస్సు ద్వారా ఎన్‌ఆర్‌ఎక్స్ ఔషధాల సరైన వినియోగం, చట్టపరమైన నిబంధనలు, సమాజానికి ఫార్మా రంగం పట్ల ఉన్న బాధ్యతలను వివరించడం జరిగింది. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ధోనీ పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చిన రఫీ

**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 7)**



భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సయ్యద్ రఫీ మార్కాపురం జిల్లా కంభం మండలం లక్ష్మీకోట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ రఫీ ఆధ్వర్యంలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, క్రీడాభిమానులు పాల్గొని మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని వారు తెలిపారు.

# జూలై 11, 12 తేదీలలో జరిగే సాహిత్య సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

జూలై 11, 12 తేదీలలో విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం నందు జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఒంగోలులో సాహితీ స్రవంతి, ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సాహిత్య స్రవంతి అధ్యక్షులు ఏ వి పుల్లారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో లౌకికవాదానికి, రాజ్యాంగానికి ముప్పు రాబోతుందని తెలిపారు. లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉన్నదన్నారు. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య సమ్మేళనంలో ఈ దిశగా చర్చలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాశం రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు మాట్లాడుతూ మంచి సాహిత్యం ద్వారానే సమాజం అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుంది అన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని యువ రచయితలు, సాహితీ వేత్తలు హాజరుకావాలని తెలిపారు. అభ్యుదయ కవి జాలాది మోహన్ మాట్లాడుతూ నేడు సమాజంలో సాహిత్యం పెడ దోరణలు పడుతుందని, వాటిని సరి చేసుకోవడానికి ఈ సాహిత్య సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. అమృత వర్షిని కార్యదర్శి కెఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ రచయితలు ఎందుకు రాస్తున్నాము? లక్ష్యాలేమిటి? ఇక ముందు ఏమి రాయాలి? అనే అంశాల గురించి ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ప్రకాశం బాలోత్సవం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సదస్సులో రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, తెలకపల్లి రవి, గుంటూరు లక్ష్మీనరసయ్య, కోయ కోటేశ్వరరావు, ఖాదర్ ముహీయుద్దీన్, అట్టాడ అప్పలనాయుడు లాంటి దిగ్గజ సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొంటున్నారు. రెండు రోజులు పాటు ఐదు సెక్షన్లో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. కావున జిల్లాలోని కవులు రచయితలు, ఈ రంగంలో ఆసక్తి కలిగిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సదస్సుకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు జి బాలకృష్ణ, విద్యార్థి సంఘ నాయకుడు వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు. వివరములకు 9490300438 సంప్రదించగలరన్నారు.

# బిపిఎడ్, డిపిఎడ్ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలో గల బిపిఎడ్, డిపిఎడ్ కళాశాలల్లో 2024-26 విద్యా సంవత్సారానికి సంబంధించి నాల్గొవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు బిపిఎడ్ కోర్సుకు సంబంధించి మొత్తం 952 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 95.6 ఉత్తీర్ణత శాతంతో 911 మంది విద్యార్థులు పాసైనట్లు, డిపిఎడ్ కోర్సుకు సంబంధించి మొత్తం 161 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 95.65 ఉత్తీర్ణత శాతంతో 154 మంది విద్యార్థులు పాసైనట్లు పరీక్షల నియంత్రణాధికారి (సిఈ) ప్రొఫెసర్ జి సోమశేఖర్ తెలియజేశారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో గల ఆయా కళాశాలల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు, సిఈ ప్రొఫెసర్ జి సోమశేఖర అభినందించారు. నాల్గొవ సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల కార్యక్రమంలో పిజి అండ్ ప్రొఫెషనల్ కోర్సుల కో ఆర్డినేటర్ (నాన్-కాన్ఫిడెన్సిల్ విభాగం) డాక్టర్ ఎ అమృతవల్లి దేవి, బిఎడ్ కోర్సుల కో ఆర్డినేటర్ (నాన్-కాన్ఫిడెన్సిల్ విభాగం) డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సూడా శివరాం పాల్గొన్నారు.

# నిజాయితీగా ఉండాలి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

## సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, పెద్దల సలహాలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 7)

విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుని క్రమశిక్షణ, అంకితభావంతో కష్టపడితే విజయం మీ సొంతమవుతుందని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ సంక్షేమంలో భాగంగా టెన్త్, ఇంటర్ లో ప్రతిభ కనబరిచిన 97 మంది పోలీసు, హోమ్ గార్డులు, డిపిఓ సిబ్బంది కుటుంబాల పిల్లలకు మొత్తం రూ. 4.85 లక్షల నగదు ప్రోత్సాహక మెరిట్ స్కాలర్ షిప్‌లు, ప్రశంశా పత్రాలను జిల్లా ఎస్పీ అందజేసి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ పోలీసు కుటుంబం అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, అదే క్రమశిక్షణతో బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. నిజాయితీతో కష్టపడి పనిచేయాలన్నారు. పోలీసు పిల్లలు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి మెరిట్ స్కాలర్ షిప్ అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఈ స్ఫూర్తితో మున్ముందు రెట్టింపు కృషితో చదువులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, క్యారెక్టర్ డెవలప్ చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైతే కుటుంబ పెద్దల, సన్నిహితుల గైడెన్స్ తీసుకోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యం కాపాడుకుంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె ప్రకాష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో తమ పిల్లలకు మంచి విద్య అందచేయాలన్న తల్లిదండ్రుల శ్రమను గుర్తించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. జీవితంలో ఎదుగుదలకు క్రమశిక్షణ చాలా ముఖ్యమని అడిషనల్ ఎస్.పీ (అడ్మిన్)శ్రీ కె ప్రకాష్ బాబు పేర్కొన్నారు. ఏ ఆర్ అదనపు ఎస్పీ రమణయ్య ఏఆర్ డిఎస్పీ పి నాగేశ్వరరావు, ఆర్ఐ టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, సభ్యులు జగన్ మోహన్‌రెడ్డి, పోలీస్, హోమ్ గార్డు, డిపిఓ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.







# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 7)


ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం విజయవాడ నుండి ఎస్ఐఆర్ నిర్వహణ, పురోగతి పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో పాటు జేసీ డాక్టర్ నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 18,96,231 మంది ఓటర్లు, 2,251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 99.68 శాతం గణన పత్రాల (ఎన్యుమరేషన్ ఫారాలు) పంపిణీ పూర్తయిందని, 18,90,106 ఫారాలను పంపిణీ చేసినట్లు వివరించారు. గణన పత్రాల డిజిటలీకరణలో 59.36 శాతం పురోగతి సాధించామని, మొత్తం 11,25,558 ఫారాలు డిజిటలీకరించామని పేర్కొన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటర్లకు గణన పత్రాల నింపడంలో సహాయం అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసి గంట గంటకూ పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పనితీరు తక్కువగా ఉన్న బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) ప్రత్యేక పర్యవేక్షకులను నియమించి డిజిటలీకరణ వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. అదనంగా 54 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులను ప్రతిపాదించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ, గ్రామీణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల సిబ్బందిని కూడా ఓటర్లకు సహాయంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. వలసలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఓటర్లు ఆన్‌లైన్‌లో కూడా గణన పత్రాలు సమర్పించేలా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ కార్యక్రమ పురోగతిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. నిర్దేశిత గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు.




# పిజిఆర్ఎస్ అర్జీల పై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 7)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్‌ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్ఓఆర్, అసైన్మెంట్స్, రీ సర్వే, పట్టాదారు పాస్ పుసకాల పంపిణీ పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. గ్రీవెన్స్ అర్జీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలను పంపించాలని ఆదేశించారు. తహసీల్దారులు సంబంధిత డివిజన్ కేంద్రాలకు వచ్చి వీటిని తమ మండలాలకు తీసుకువెళ్లాలని, అనంతరం వీఆర్వోలు తమ మండల కార్యాలయానికి వచ్చి అర్జీలను తీసుకొని క్షేత్రస్థాయిలో పరిష్కారానికి చర్యలు ప్రారంభించాలని చెప్పారు. ఈ దిశగా ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ' మీకోసం ' అర్జీల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీచేసిన సర్క్యులర్ల పైనా డివిజన్, మండల స్థాయి రెవిన్యూ అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా కలెక్టర్ చెప్పారు. అర్జీదారులను కోర్టుకు వెళ్లాలని చెప్పటం కాకుండా రెవెన్యూ అధికారులే మరింత దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలనీ ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో యమయస్‌యంఈ పార్కుల పురోగతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులకు సూచించారు. పిజిఆర్‌యస్ కి సంబందిటచి వచ్చిన ఆర్జీలను పరిశీలించి రెవిన్యూ,భూ సమస్యలు, ఫ్యామిలీ సంబందిత సమస్యలు లాంటివి విడి విడిగా చేసి వాటిని ఖేత్రస్తాయిలో పరిశీలించి అవరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిదముగా రోజుకు రెండు విషయాలమీద దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గ్రీవెన్స్, భూ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# లేజర్ విధానంతో కిడ్నీ రాళ్ళకు విజయవంతమైన చికిత్స





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**

జీజీహెచ్ ఒంగోలులో అత్యాధునిక లేజర్ విధానంతో కిడ్నీ రాళ్లకు విజయవంతమైన చికిత్స యూరాలజీ వైద్య బృందాన్ని అభినందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) యూరాలజీ సూపర్ స్పెషాలిటీ విభాగంలో అత్యాధునిక లేజర్ హోల్మియం లేజర్ (హోలమియం లేజర్) సాంకేతికతతో కిడ్నీ రాళ్లకు విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. ఆసుపత్రికి ఇటీవల అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక లేజర్ యంత్రాలు, అవసరమైన పరికరాల సహాయంతో కిడ్నీ రాళ్లకు కోత లేకుండా, తక్కువ రక్తస్రావంతో, అత్యంత సురక్షితంగా లేజర్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా యూరాలజిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ నాయకత్వంలోని వైద్య బృందం డాక్టర్ కె మాలకొండారెడ్డి (అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ ఎండి రసూల్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ జయసుందరం, ప్రొఫెసర్ (అనస్తీషియా)లు అందించిన సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ లేజర్‌ను కేవలం కిడ్నీ రాళ్లకే కాకుండా, మూత్రనాళ రాళ్లు, మూత్రాశయ రాళ్లు, ప్రోస్టేట్ సమస్యలు, అలాగే కొన్ని మృదుకణజాల (సాఫ్ట్ టిష్యూ) శస్త్రచికిత్సలలో కూడా ఉపయోగించవచ్చున్నారు. ఇటీవల దిబ్బయ్య అనే రోగి కిడ్నీలో రాళ్ల సమస్యతో జీజీహెచ్‌ను ఆశ్రయించారని, వీరిని పరీక్షించిన, యూరాలజీ నిపుణులు డాక్టర్ జి కిరణ్ కుమార్ బృందం పూర్తి స్థాయిలో పరీక్షించి కిడ్నీలో రాళ్లను గుర్తించారు. దిబ్బయ్యకు శస్త్ర చికిత్స అవసరం అని భావించి జిజిహెచ్‌లో అందుబాటులో వున్న అత్యాధునిక లేజర్ విధానంలో విజయవంతంగా చికిత్స అందించామన్నారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఖర్చయ్యే ఈ అత్యాధునిక లేజర్ కిడ్నీ స్టోన్ శస్త్రచికిత్సను జీజీహెచ్ ఒంగోలులో ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులైన రోగులకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కిడ్నీ రాళ్ల సమస్యతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ మాట్లాడుతూ అధునాతన వైద్య పరికరాలు, వైద్యుల అంకితభావంతో సూపర్ స్పెషలిటీ సేవలు ప్రజలకు విస్తృతంగా అందుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవిలత, ప్రభాకరావు, ఏఆర్ఎంఓ సునీల్ గవాస్కర్, తదితరులు వున్నారు.

## ఎమ్మార్పీ రేట్లకే ఎరువుల అందజేయాలి

### జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 7)**

ఎమ్మార్పీ రేట్లకే రైతులకు ఎరువుల అందజేయాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జిల్లాలో ఎరువుల అందుబాటు, రేట్ల పై వ్యవసాయ అధికారులు, డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే ఇవ్వాలని అదే సమయంలో వారికి బిల్లులు అందజేయాలన్నారు. యాప్ ద్వారా మాత్రమే ఎరువులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. రసాయనక ఎరువులు వాడకం తగ్గించదంతో పాటు, నానో ఎరువులు జీవ ఎరువులు సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఇన్చార్జి అధికారి బాలాజీనాయక్, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ఏడిఏలు రాజశ్రీ, జైనులాబ్దిన్, వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బావిలో లభించిన మృతదేహం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

### కేసును శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, త్వరితగతిన ఛేదించేలా అధికారులకు సూచనలు




**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 7)**

నెల రోజుల క్రితం సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో ఉన్న బావిలో అంకం రాహుల్ (21) విద్యార్థి మృతదేహం లభించిన ఘటన పై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టడం జరుగుతోందని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నేరం జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తును సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిర్వహిస్తున్నారని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహం అంకం రాహుల్‌దేనని నిర్ధారణ కావడంతో, ఆ విషయాన్ని అతని తల్లిదండ్రులకు తెలియచేయటం జరిగిందన్నారు. రాహుల్ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించేందుకు అప్పటి నుంచే పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ముందుగా సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల స్థితిగతులు, సిబ్బంది పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలించుటకు సింగరాయకొండ సర్కిల్ కార్యాలయమును మంగళవారం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో నమోదైన కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించారు. కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, విచారణ తీరు తదితర అంశాలపై అధికారులను ఆరా తీసి, కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడే దర్యాప్తు విధానాలపై పలు సూచనలు చేశారు. సింగరాయకొండ సమీపంలోని ఎన్‌హెచ్16 ఎమర్జెన్సీ ల్యాండింగ్ రోడ్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రమాదాల నివారణకు ఎమర్జెన్సీ ల్యాండింగ్ రోడ్డును పరిశీలించినట్లు జిల్లా ఎస్పీ గారు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, తగిన లైటింగ్, అండర్‌పాస్‌ల ఏర్పాటు, రోడ్డు మార్జిన్ వెంట వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ ఎస్ఐ సుధీర్ కుమార్, సిబ్బంది ఉన్నారు.





## దళిత నేత నీలం నాగేంద్ర సమక్షంలో పోలీస్ స్టేషన్లో కులాంతర వివాహ కథ సుఖాంతం

### కనిగిరి అత్తారింటికి కాపురానికి వెళ్లిన కాకినాడ గంగాభవాని

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**



కాపు కులానికి చెందిన గంగాభవాని మాదిగ కులానికి చెందిన రాహుల్ కులాంతర ప్రేమ వివాహం కాకినాడ ఖాకీల వేటలో ఎట్టకేలకు మంగళవారం దళితనేత నీలం నాగేంద్ర సమక్షంలో సుఖాంతమైంది. కాకినాడ పట్టణానికి చెందిన మచ్చ గంగరాజు కుమార్తె మచ్చ గంగాభవాని మార్కాపురం జిల్లా కనిగిరి మండలం బల్లిపల్లి గ్రామానికి చెందిన పరిసపోగు రాహుల్ గోదావరి జిల్లా భీమవరంలో ఫార్మసీ కాలేజీలో చదువుకున్నారు. డి ఫార్మసీ చదువుకున్న నాలుగేళ్లలో వీళ్ళ పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్లిదాకా వచ్చింది అయితే వీరిలో గంగాభవాని కాపు కులానికి చెందినది కాగా రాహుల్ మాదిగ కులానికి చెందిన వాడు కావడంతో గంగా భవాని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కుల పెద్దలు వీరి కులాంతర వివాహాన్ని వ్యతిరేకించారు. తమ కులానికి చెందిన యువకుడితో నిశ్చితార్థం నిర్ణయించారు. అంతట కాపు కుల పెద్దలు కుటుంబ సభ్యులకు భయపడిపోయి గంగాభవాని తాను ప్రేమించిన రాహుల్ తో కాకినాడ నుంచి కనిగిరి చేరింది. రాహుల్ కుటుంబ సభ్యులు ఒంగోలు అంబేద్కర్ భవన్లో గత నెల 27వ తేదీన కులాంతర వివాహం జరిపించారు. అంతకుముందు నుండే కాకినాడ పోలీసులు ఈ కులాంతర వివాహ జంట కోసమై వేటాడుతున్నారు. వీరు వీరి బంధువులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని చాలాకాలం గడిపారు చివరకు కాకినాడ పోలీసులు కనిగిరి చుట్టుపక్క ప్రాంతాలలో గాలించారు దిక్కుతోచని పరిస్థితుల్లో రాహుల్ సమీప బంధువు గుంట గాని పేతురు ఒంగోలులోని దళిత నాయకుడు నీలం నాగేంద్ర దృష్టికి ఈ కులాంతర వివాహ సమస్యను తీసుకువచ్చి రక్షణ కల్పించాలని కోరారు. సోమవారం తన కార్యాలయంలో రాహుల్ గంగాభవాని కులాంతర వివాహ వేడుక జరిపి తదనంతరం ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉన్న జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి కులాంతర వివాహ జంటకు చట్టపరమైన రక్షణ కల్పించాలని చర్యలు తీసుకోవాలని కోరారు. అంతట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం ఎస్ఐ సతీష్ ఫేస్బుక్లో నీలం నాగేంద్రరావు జరిపించిన కులాంతర వివాహ జంట వీడియో సోషల్ మీడియాలో చూసి ఫోన్ చేశారు. తమ ఆఫీసు దగ్గరగా ఉన్న ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ రావాలని నీలం పోలీస్ వారికి చెప్పారు. అంతట అన్నవరం ఎస్ఐతో పాటు గంగాభవాని తల్లిదండ్రులు స్థానిక కాపు పెద్దలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. అక్కడ ఇరు కుటుంబాలు చర్చలు అనంతరం అన్నవరం ఎస్ఐ గంగాభవాని దగ్గర పెళ్లికి సంబంధించిన స్టేట్మెంట్ తీసుకున్నారన్నారు. గంగాభవాని తల్లిదండ్రులు కూతురు, అల్లుడుతో మాట్లాడటానికి నీలం నాగేంద్రరావు అనుమతించి వాళ్లని ఓదార్చి ఇరుకులాల పెద్దలను సముదాయించి ఎట్టకేలకు కాకినాడ కాపుల అమ్మాయి గంగాభవానిని కనిగిరి రాహుల్ మాదిగ ఇంటికి కాపురానికి పంపించారు. ఈ కార్యక్రమంలో గుంట గాని పేతురు, దారా అంజయ్య, పట్రా బంగారం గోపి, తదితరులున్నారు.




## పోక్సో చట్టం పై అవగాహన పెంచుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 7)**

మైనర్ల పై లైంగిక వేధింపుల కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించడానికి పోక్సో చట్టం ఎంతో అవసరమని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పోక్సో చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం పిల్లల హక్కులను కాపాడుతుందని, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. పోక్సో చట్టంతోపాటు సైబర్ నేరాలు, గంజాయి వలన కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా రెవిన్యూ అధికారికి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ప్రకాశం జిల్లా రెవిన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి వెంకటరమణను ప్రకాశం జిల్లా రెవిన్యూ అసోసియేషన్ జిల్లా శాఖ, కలెక్టరేట్ యూనిట్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. 29 మంది విలేజ్ రెవిన్యూ ఆఫీసర్స్ కి సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించినందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ లకు ధన్యవాదాలు తెలిపారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు, జిల్లా కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధ్యక్షులు బి సత్యసాయి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాము, జిల్లా ఈసీ మెంబర్ వై ప్రశాంత్ నాయుడు, జేఏసీ అమరావతి జాయింట్ సెక్రటరి వెంకటేశ్వరరాజులు కలిసి రెవిన్యూ ఉద్యోగుల సమస్యల మీద చర్చించడం జరిగింది.

## గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతున్న ప్రకాశం జిల్లా పోలీసులు

**ఒంగోలు రైల్వే స్టేషన్‌లో, రైళ్లలో విస్తృత తనిఖీలు**

**సుమారు 10 కేజీల గంజాయి స్వాధీనం**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 7)








గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో సిసిఎస్ సీఐ కమలాకర్, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో పాల్గొని, మాదకద్రవ్యాలను గుర్తించే జాగిలం సహాయంతో ఒంగోలు రైల్వే స్టేషన్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా పూర్తిగా పరిశీలించారు. ఈ క్రమంలో పూరి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, తదుపరి దర్యాప్తు నిమిత్తం జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు తెలియజేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీలో ఎస్ఐలు శ్రీరామ్, చెంచయ్య, ఏఎస్ఐ మహబూబ్ భాషా, ఆర్‌పిఎఫ్, ఈగల్ టీం సిబ్బంది, డాగ్ హ్యాండ్లర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# నిబంధనలను కఠినతరం చేయాలి

**జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 7)

రోడ్డు భద్రత చర్యల నిబంధనలు, ఆంక్షలను కఠినతరం చేస్తూ జిల్లాలో రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారు. సమావేశంలో రవాణా, పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో కలిసి రహదారి భద్రత, ప్రమాదాల నివారణ చర్యలు, జీరో ఫ్యాటాలిటీ జిల్లా కార్యక్రమం, జాతీయ రహదారులపై ఆక్రమణల తొలగింపు, పాఠశాలల పరిసరాల్లో భద్రతా చర్యలపై ఆయా శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2026 జనవరి నుంచి జూన్ వరకు జరిగిన రహదారి ప్రమాదాల గణాంకాలను సమావేశంలో పరిశీలించారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మొత్తం ప్రమాదాల సంఖ్య స్వల్పంగా పెరిగినా, మరణాల సంఖ్య తగ్గినట్లు అధికారులు వివరించారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య అత్యధిక ప్రమాదాలు నమోదవుతున్నాయని గుర్తించి, ఆ సమయంలో ప్రత్యేక గస్తీ, ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలును మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, హిట్ అండ్ రన్ ఘటనలు, పాదచారుల భద్రత లోపించడం వంటి కారణాలతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని అధికారులు వివరించగా, ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు కఠిన అమలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే 92 కీలక ప్రాంతాలను గుర్తించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు, జీబ్రా క్రాసింగ్‌లు, సోలార్ బ్లింకర్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ తదితర రహదారి భద్రతా సదుపాయాలను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారులపై ఆక్రమణలను పూర్తిగా తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు, వీధి వ్యాపారుల తరలింపు వంటి చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎంపికైన ఆరు జీరో ఫ్యాటాలిటీ జిల్లాల్లో వైఎస్సార్ కడప జిల్లా ఒకటిగా ఉన్నందున, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు ఇచ్చే భద్రతా చర్యలను వెంటనే అమలు చేయాలని, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల పరిసరాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్డు భద్రతపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మైనర్లు వాహనాలు నడపకుండా పర్యవేక్షించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో రహదారి భద్రతా సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. రహదారి ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని, గుడ్ సమారిటన్ పథకం, పీఎం రాహత్ నగదురహిత చికిత్స పథకం అమలును మరింత సమర్థవంతంగా కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసుల పురోగతిని వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అదే విధంగా పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసే ప్రక్రియను కొనసాగించాలని, పోలీసు-రవాణా శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ వీర్రాజు, కేఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, జెడ్పి సీఈవో, డిపివో సుబ్రహ్మణ్యం, ఆర్అండ్‌బి శాఖ ఎస్ఈ చంద్రశేఖర్, కమిటీ సభ్యులైన విద్యుత్ శాఖల ఎస్ఈలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, రోడ్ సేఫ్టీ డిఎస్పీ, ఐరాడ్ జిల్లా కోఆర్డినేటర్, రోడ్డు భద్రత ఎన్‌జిఓల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 7)

మార్కాపురం జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు మంగళవారం మధ్యాహ్నం పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేసి భోజనం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. తదుపరి పాఠశాల ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థులలో మానవసంబంధాలు, నైతిక విలువలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాల్సిందిగా సూచనలు ఇచ్చారు. గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో సబ్జెక్టుల వారీగా రివ్యూ నిర్వహించడం జరిగింది. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో విద్యార్థుల చేత సంభాషణ చేయించడం జరిగింది. తెలుగు, ఆంగ్లంలో విద్యార్థులు యొక్క సంభాషణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ హిందీ భాష సంభాషణలో కొంత అసంతృప్తిని వ్యక్తం చేయటం జరిగింది. విద్యార్థులను మూడు భాషలలో ఖచ్చితంగా సంభాషణ చేయు విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వవలసిందిగా సూచించారు. అంతే కాకుండా గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల పై రివ్యూ మీటింగ్ నిర్వహించి ఆయా సబ్జెక్టులలో వచ్చిన ఫలితాలకు తీసుకున్నటువంటి యాక్షన్ ప్లాన్స్ ఏమిటి? వచ్చే 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ఎటువంటి యాక్షన్ ప్లాన్ తో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎటువంటి ప్రయత్నం చేస్తున్నారో వ్రాతపూర్వకంగా తెలుపమని ఉపాధ్యాయులను ఆదేశించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు మిగతా అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోజారాణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.









## రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్ సుమన్‌కు జీజీహెచ్‌లో ఘన సన్మానం

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ఉద్యోగ సంఘాల సమన్వయం అవసరం**

**డాక్టర్ ఎస్ మాణిక్యరావు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఎస్ సుమన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఆసుపత్రి వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మంగళవారం జీజీహెచ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సుమన్‌కు సహచర కాంట్రాక్ట్ నర్సులు ఘనంగా సన్మానం నిర్వహించారు. అనంతరం ఎస్ సుమన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ప్రభుత్వ సర్వజన వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు మాట్లాడుతూ జీజీహెచ్‌లో పనిచేస్తున్న సిబ్బంది రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహించడం ఆసుపత్రికి గర్వకారణమన్నారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించి, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత మేర పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్ సుమన్‌కు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో కాంట్రాక్ట్ నర్సుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఎస్. సుమన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ నర్సెస్ అసోసియేషన్ మరింత బలోపేతం కావాలని, రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ నర్సుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీసీఎన్ఏ జిల్లా అధ్యక్షురాలు యు ఉదయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె మంజేష్, కార్యవర్గ సభ్యులు మహేష్, విజయ్ కుమార్, చిన్న కాశయ్య, జోయల్, హనుమంతు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com